క్లుప్తంగా

క్లారినెట్ విద్వాంసుడు లక్ష్మీనారాయణకు సన్మానం



తెనాలిఅర్బన్: నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో బుధవారం ఉమ్మడి కుటుంబం చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. గురువారం సింహం నవ్వింది చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం ప్రముఖ క్లారినెట్ విద్వాంసుడు సుజ్జన లక్ష్మీనారాయణను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కొరపాటి లక్ష్మి, కొర్రపాటి శ్రీనివాస్, మానుకొండ మహేష్, మానుకొండ తులసీ చిరంజీవి, కార్తికేయ చౌదరి, పెమ్మసాని పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలలో పలువురికి పతకాలు



తెనాలిఅర్బన్: రెండో ఏపీ స్టేట్ లెవల్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలలో తెనాలిలోని కేఎస్‌కే తైక్వాండో అకాడమీ క్రీడాకారులు ఏడు బంగారు, నాలుగు వెండి, అయిదు కాంస్య పతకాలు సాధించారని తెనాలి మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ తెలిపారు. ఈనెల 11,12 తేదీలలో రేపల్లెలో పోటీలు జరిగినట్లు చెప్పారు. పతకాలు సాధించిన వారిని తెనాలిలో బుధవారం అభినందించి, మెడల్స్ అందజేశారు. కౌన్సిలర్ కుర్రా సుజాత, వైఎస్సార్ సీపీ నాయకుడు కుర్రా శ్రీను, అకాడమీ నిర్వాహకులు కొక్కిలగడ్డ శ్రీనివాసరావు, ఎం.వరప్రసాద్, టి.చంటి తదితరులు పాల్గొన్నారు.

రక్తసేకరణలో జాగ్రత్తలు ముఖ్యం



తెనాలిఅర్బన్: రక్త సేకరణలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెనాలి ఇన్‌చార్జి మలేరియా సహాయ అధికారి వంగల పున్నారెడ్డి సూచించారు. తెనాలి పట్టణ పరిధిలోని ఆరోగ్య కేంద్రాలలో పనిచేసే ల్యాబ్ టెక్నిషియన్‌లతో బుధవారం పాత ప్రభుత్వ వైద్యశాలలోని మలేరియా కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. రక్త సేకరణ, వాటిని పరీక్షించే, భద్రపరిచే విధానంపై వారికి పలు సూచనలు చేశారు. సమావేశంలో మలేరియా సూపర్‌వైజర్ దీపాల శ్రీనివాసరావు, ల్యాబ్ టెక్నీషియన్‌లు పాల్గొన్నారు.

కొలకలూరు మాజీ సర్పంచి సోమయ్య మృతి



తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరు గ్రామ మాజీ సర్పంచి కాలిశెట్టి సోమయ్య (70) బుధవారం మృతి చెందారు. తెనాలి మండల పరిషత్ ఉపాధ్యక్షుడిగా, కొలకలూరు సర్పంచ్‌గా సోమయ్య పనిచేశారు. ఆయనకు భార్య, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, మాజీ సర్పంచ్‌లు, జనసేన, టీడీపీ నాయకులు సందర్శించి నివాళులర్పించారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, గ్రామ సర్పంచి చొప్పర ప్రీతి, ఎంపీటీసీ సభ్యులు కాలిశెట్టి ఫణికుమార్, గ్రామ మాజీ సర్పంచ్‌లు వల్లూరి వరప్రసాద్, కాలిశెట్టి లక్ష్మీనాంచారమ్మ, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తోటకూర రమణరావు, వైఎస్సార్ సీపీ నాయకులు తులాబందుల లక్ష్మీకోటేశ్వరరావు, చిట్టిబాబు, కొలకలూరి నాగేశ్వరరావు, వీరమల్లు కార్తికేయ, సుంకర శ్రీనివాసరావు, దివ్వెల మధుబాబు, గుంటూరు కృష్ణమోహన్, గోపిశెట్టి ముసలయ్య, తదితరులు సోమయ్య మృతదేహం వద్ద నివాళులర్పించారు.

పోలీసుల అదుపులో అనుమానితులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో పలుచోట్ల దొంగతనాలు జరగడంతో పోలీసులు కొంతమంది అనుమానితులను బుధవారం అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. తాడేపల్లి పట్టణం, రూరల్ పరిధిలో వ్యవసాయ విద్యుత్ మోటార్లు, నిర్మాణంలో ఉన్న భవనాల వద్ద కరెంటు, ఇతర సామగ్రి దొంగిలించిన విషయంలో మంగళగిరి చెందిన నలుగురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. పోలీసులు నలుగురిని అదుపులోకి తీసుకోగా, వారిలో ముగ్గురు జాతీయ రహదారి వెంబడి కొలనుకొండ వద్ద నిర్మాణంలో ఉన్న భవనంలో విద్యుత్ పరికరాలు దొంగిలిస్తూ బైక్‌తో సహా పట్టుబడినట్లు తెలుస్తోంది. ఆ ద్విచక్ర వాహనం కూడా వేరే ప్రాంతం నుంచి దొంగిలించి ఇక్కడ దొంగతనానికి ఉపయోగించినట్లు సమాచారం.

క్యాన్సర్ రహిత తెనాలే లక్ష్యం

- శారద సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవ దేశానికే ఆదర్శం
- ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



వైద్యశిబిరంలో మహిళలతో ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: మహిళల్లో క్యాన్సర్ రహిత తెనాలి లక్ష్యంగా కృషిచేస్తున్నట్లు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. ఇందుకు నాంది పలికిన శారద సర్వీస్ సొసైటీని ప్రోత్సహిస్తూ, మున్సిపాలిటీని భాగస్వాములను చేసి లక్ష్యసాధనకు ముందుకు సాగుతున్నామని వెల్లడించారు. పట్టణానికి చెందిన శారద సర్వీస్ సొసైటీ, స్థానిక మున్సిపాలిటీ సంయుక్తంగా ఏర్పాటుచేస్తున్న ఆరో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్యశిబిరాన్ని బుధవారం స్థానిక పదోవార్డులోని సచివాలయంలో నిర్వహించారు. పట్టణంలోని 6,7,8,10,11 వార్డుల మహిళల కోసం ఏర్పాటైన వైద్యశిబిరంలో డాక్టర్ శారద, బృందం 120 మంది మహిళలకు రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను చేశారు. థైరాయిడ్ కేసులు 8, రొమ్ము గడ్డలు రెండు, గర్భాశయ పుండ్లు మూడు కేసులను గుర్తించారు. పాప్‌స్మియర్ పరీక్షల ఫలితాలు రావాల్సి ఉంది. శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ ప్రాణాంతక వ్యాధులను ఆరంభంలోనే గుర్తించటం ఎంతో అవసరమన్నారు.

ప్రజల ఆరోగ్య సంరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో డబ్బును వెచ్చిస్తున్నట్టు చెప్పారు. దీనితోపాటు శారద సర్వీస్ సొసైటీ వంటి సంస్థలు అందిస్తున్న స్వచ్ఛంద సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్యాన్సర్ రహిత తెనాలికి నాంది పలికిన డాక్టర్ శారదకు అభినందనలు తెలియజేశారు. ప్రస్తుతం నిర్వహించిన శిబిరంతో పట్టణంలోని 40 వార్డుల్లో 27 వార్డుల్లోని మహిళలకు స్క్రీనింగ్ పరీక్షలు చేసినట్టయిందని చెప్పారు. శారద సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ శారద మాట్లాడుతూ గత ఎనిమిది నెలలుగా తెనాలిలో వార్డులవారీగా నిర్వహిస్తున్న స్క్రీనింగ్ శిబిరాల్లో 1820 మందికి పరీక్షలు చేశామని చెప్పారు. వారిలో 25 హైరిస్క్ కేసులను గుర్తించామన్నారు. 15 మంది క్యాన్సర్ సంబంధిత చికిత్సకు వెళుతున్నట్టు చెప్పారు. మరో 80 మందిలో గర్భాశయ పుండ్లను గుర్తించి, చికిత్స చేయగలిగినట్టు వివరించారు. గర్భాశయ క్యాన్సర్‌ను గుర్తించే పాప్‌స్మియర్ పరీక్షను ఉచితంగా చేస్తున్నామని చెప్పారు. ప్రాథమిక దశలోనే క్యాన్సర్‌ను గుర్తిస్తే చికిత్సతో నయం చేయొచ్చని అన్నారు. మున్సిపల్ ఆరోగ్య అధికారి డాక్టర్ హెలెన్ నిర్మల, అసిస్టెంట్ కమిషనర్ గోపాలరావు, కౌన్సిలరు తిరుమలశెట్టి సామ్రాజ్యం, పార్టీ నేతలు కఠారి హరీష్, షేక్ దుబాయ్‌బాబు, అక్కిదాసు కిరణ్, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే శివకుమార్



పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిఅర్బన్: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలను అందిస్తూ ప్రజల దీవెనలు పొందుతున్న ప్రభుత్వం తమదని తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని 19వ వార్డు టెలిఫోన్ ఎక్చేంజ్ రోడ్డు నుంచి బుధవారం సాయంత్రం ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ 19వ వార్డు నాయకులు పాత్తూరి వీరరాఘవయ్య, టెక్స్ బాల, చుండూరు సాయిల ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియజేసి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ గర్భిణులకు వైఎస్సార్ పోషణ, పుట్టిన బిడ్డలకు పౌష్టికాహారం, బాల్యంలో అమ్మఒడి, యువతీ యువకులకు విద్యాదీవెన, వసతి దీవెన, మహిళలకు ఈబీసీ నేస్తం, కాపు నేస్తం, వైఎస్సార్ ఆసరా వంటి పథకాలు, వృద్ధాప్యంలో పింఛన్ వంటి పథకాలతో ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తుందని గుర్తు చేశారు. అన్ని వయస్సుల వారికి ప్రభుత్వం ఆసరాగా నిలస్తుండటంతో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. 19వ వార్డులో 606 ఇళ్లు ఉండగా 2,051 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వైఎస్సార్ ఆసరా 220మందికి వైఎస్సార్ సున్నా వడ్డీ 240మందికి, జగనన్న తోడు 80మందికి, అమ్మ ఒడి 120మందికి, విద్యాదీవెన, వసతి దీవెన 45 మందికి, అగ్రిగోల్డ్ బాధితులకు 46మందికి, ఈబీసీ నేస్తం 45 మందికి అందించినట్లు వివరించారు. 19వ వార్డులో ఇప్పటి వరకు సుమారు రూ.8కోట్ల సంక్షేమాన్ని అందించినట్లు పేర్కొన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు మాలేపాటి హరిప్రసాద్, గుంటూరు కోటేశ్వరరావు, కౌన్సిలర్లు షేక్ దుబాయ్‌బాబు, యాతాటి అనిల్, పేరం సంజీవరెడ్డి, గడవర్తి సాయిహరేరామ్, ఆవుల కోటయ్య, కో–ఆప్షన్ సభ్యుడు పెచ్చింగ్ సుభానీ, నందివెలుగు సర్పంచి ధూళిపాళ్ళ పవన్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్ఆర్‌కే శర్మ, దేసు శ్రీనివాసరావు, ఏలూరి శేషగిరిరావు, కాకిదేవ సహాయం, కాళిదాసు వెంకటేశ్వరరావు, అక్కిదాసు కిరణ్‌కుమార్, సిరి కృష్ణ, కాళిదాసు సత్యం పాల్గొన్నారు.

మహిళల వెయిట్‌లిఫ్టింగ్‌లో విజేతలు



విజేతలైన లిఫ్టర్లతో ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇటీవల నిర్వహించిన అంతర కళాశాలల మహిళల వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ విద్యార్థి ముక్కడాల అనూష 65 కిలోల విభాగంలో తలపడి కాంస్య పతకం సాధించింది. ప్రకాశం జిల్లా ఒంగోలులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పీజీ క్యాంపస్‌లో పీజీ చేస్తూ, ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీలో శిక్షణ పొందుతున్న తోట లావణ్య (55 కిలోలు), ముక్కామల సంయుక్త (87 కిలోలు) తమతమ కేటగిరీ పోటీల్లో బంగారు పతకాలను సాధించారు. ఈ నెల 27వ తేదీ నుంచి 29వ తేదీవరకు కేరళలోని కాలికట్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జరగనున్న మహిళల వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో తోట లావణ్య, ముక్కామల సంయుక్త ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి ప్రాతినిధ్యం వహిస్తారని కాలేజీ వ్యాయామ అధ్యాపకుడు నల్లక శేషగిరిరావు తెలిపారు. క్రీడాకారిణులను ఏఎస్ఎన్ విద్యాసంస్థల చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ అభినందించారు.

హుండీ ఆదాయం రూ.5.49 లక్షలు

మంగళగిరి: నగరంలో వేంచేసిఉన్న గంగాభ్రమరాంబ మల్లేశ్వరస్వామి (శివాలయం) దేవస్థానం హుండీ ఆదాయం రూ.5,49,597 సమకూరింది. బుధవారం ఆలయ ఆవరణలో హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆలయ ఈఓ రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.

పోలీస్ డైరీ ఆవిష్కరణ

మంగళగిరి: నగరంలోని ఏపీఎస్పీ ఆరవ బెటాలియన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను కమాండెంట్ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ ఈఎస్ సాయిప్రసాద్, అసోసియేషన్ సభ్యులు గణపతి, కిరణ్, సీహెచ్‌వీ శేఖర్, కేఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

తాడేపల్లిరూరల్: కార్పొరేషన్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం సచివాలయ సిబ్బంది కొలనుకొండలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. కొలనుకొండ ప్రధాన రహదారిలోని కొన్నిచోట్ల పైపులైన్లు మరమ్మతులకు గురై తాగునీరు వృథాగా పోతుండటంతో, మరమ్మతులు నిర్వహించి, అవసరమైన చోట కొత్త పైపులైన్లు ఏర్పాటు చేశారు. గంగానమ్మపేటలో బోరు పంపునకు మరమ్మతులు నిర్వహించి తాగునీటి సమస్యను పరిష్కరించారు.

వైభవంగా బ్రహ్మంగారి మందిర వార్షికోత్సవం

ఫిరంగిపురం: నుదురుపాడు గ్రామంలోని బ్రహ్మంగారి అరుగు, మందిర 20వ వార్షికోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే బ్రహ్మంగారి విగ్రహం వద్ద పూజలు చేసి పొంగళ్లు పొంగించారు. ప్రతి ఏటా బ్రహ్మంగారి మందిరం ముందు ఉన్న అరుగును శుభ్రం చేయించి పూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ప్రజలతో మర్యాదగా వ్యవహరించండి



రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్ జశ్వంతరావు

తెనాలిఅర్బన్: సచివాలయాలకు వచ్చిన ప్రజలతో మర్యాదగా వ్యవహరించడంతో పాటు స్నేహపూర్వకంగా నడుచుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు ఆదేశించారు. పట్టణంలోని 41,42 సచివాలయాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. అలాగే సచివాలయంలో ఏర్పాటు చేసిన లబ్ధిదారుల లిస్ట్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలను పాటించాలని సూచించారు. అధికారులు అడిగిన ప్రతి సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా అందజేయాలన్నారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ అధికారులు ఉన్నారు.

ఆలయ నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలి

దేవదాయ శాఖ ఏసీ ఉమామహేశ్వరరెడ్డి



ఆలయ నిర్మాణ స్థలాన్ని అధికారులతో కలసి పరిశీలిస్తున్న ఏసీ ఉమామహేశ్వరరెడ్డి

కొల్లిపర: వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణాన్ని అధికారులు వెంటనే ప్రారంభించాలని దేవదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ బొంతు ఉమామహేశ్వరరెడ్డి ఆదేశించారు. బుధవారం స్థానిక శ్రీవీరభద్రస్వామి కాలనీలో వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ స్థలాన్ని ఎంపీడీఓ పి.శ్రీనివాసులు, తహసీల్దార్ జి.నాంచారయ్య, వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున దేవాలయం నిర్మాణం కోసం రూ.10లక్షలు కేటాయించటం జరిగిందన్నారు. అధికారులు నిర్మాణ పనులు ప్రారంభిస్తే వెంటనే నిధులు ఇవ్వటం జరుగుతుందన్నారు. ఆలయ ఈఓ వంగా కోటిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ వంగా భూషిరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు భీమవరపు సంజీవరెడ్డి, చెంచల రామిరెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఖిద్మత్ బృందం సేవలు అభినందనీయం

పట్టణ సీఐ బి.అంకమ్మరావు



దివ్యాంగుడికి నిత్యావసర సరుకులు అందజేస్తున్న సీఐ బి.అంకమ్మరావు

మంగళగిరి: మానవ సేవలోనే పరమానందం దాగుందని గ్రహించిన పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన యువకులు ఖిద్మత్ టీమ్ పేరుతో స్వచ్ఛంద సేవా సంస్థను ఏర్పాటు చేసి అమోఘమైన సేవలు అందించడం అభినందనీయమని పట్టణ సీఐ బి.అంకమ్మరావు పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ఖిద్మత్ టీమ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పలు నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పట్టణ సీఐ బి.అంకమ్మరావు ముఖ్యఅతిథిగా పాల్గొని పేదలకు నిత్యావసర సరుకులను అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మనిషిగా పుట్టినందుకు తోటి వారికి సహాయపడాలన్నారు. గత మూడేళ్ల నుంచి ఖిద్మత్ టీమ్ సభ్యులు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు మరువలేనివని, కరోనా కాలంలో ఎంతో మంది మృతులకు కుల, మతాలకు అతీతంగా అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారన్నారు. కార్యక్రమంలో ఖిద్మత్ టీమ్ లీడర్ షఫీతో పాటు సభ్యులు పాల్గొన్నారు.

22న 'సూర్యచంద్రులు' సంగీత విభావరి



బ్రోచర్ ఆవిష్కరించిన సాయి లక్కరాజు

తెనాలి: స్వర్గీయ ఎన్టీఆర్, ఏఎన్నార్‌ల వర్ధంతి పురస్కరించుకుని పట్టణానికి చెందిన సంగీత సాంస్కృతిక సంస్థ స్వరలయ వేదిక ఆధ్వర్యంలో 'సూర్యచంద్రులు' పేరుతో ఈనెల 22న సంగీత విభావరిని నిర్వహిస్తున్నట్టు సంస్థ వ్యవస్థాపకుడు సాయి లక్కరాజు చెప్పారు. సంస్థ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సంబంధిత బ్రోచర్‌ను ఆహ్వానించారు. ఆరోజు సాయంత్రం 5.30 గంటలకు తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో సంగీత విభావరి ఉంటుందన్నారు. సినీవినీలాకాశంలో సూర్యచంద్రుల వంటి వారు ఎన్టీఆర్, ఏఎన్నార్ అనే భావనతో నిర్వహించే కార్యక్రమంలో ప్రముఖ గాయనీగాయకులు వారి పాటలతో అలరిస్తారని చెప్పారు. సంగీత ప్రియులు జయప్రదం చేయాలని కోరారు.

జగనన్న భూహక్కు సర్వేకు శ్రీకారం

- ఆస్తి, సరిహద్దు వివాదాలకు పరిష్కారం
- డెప్యూటీ సిటీ ప్లానర్ దొర



నగరంపై డ్రోన్ సర్వే



సర్వేలో పాల్గొన్న అధికారులు

మంగళగిరి: నవ్యనగరం మంగళగిరిలో జగనన్న శాశ్వత భూ హక్కు పథకం సర్వేకు అధికారులు శ్రీకారం చుట్టారు. నగరంలోని ఆంజనేయ కాలనీ, ఆత్మకూరు నిర్మలా కాన్వెంట్ వద్ద పైలెట్ ప్రాజెక్టు కింద బుధవారం డ్రోన్ సర్వే ప్రారంభించారు. డ్రోన్ సర్వే ఆధారంగా గృహాలు, స్థలాల సరిహద్దులను నిర్ధారించి యజమానులకు సర్టిఫికెట్లను అందించనున్నారు. డ్రోన్ సర్వే కార్యక్రమాన్ని డెప్యూటీ సిటీ ప్లానర్ దొర, అసిస్టెంట్ సిటీ ప్లానర్ సీహెచ్ వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డీసీపీ దొర మాట్లాడుతూ డ్రోన్ కెమెరా 50 నిమిషాల సమయంలో దాదాపు 200 ఖాళీ స్థలాలు, నివాస గృహాల చిత్రాలను తీస్తుందన్నారు. వాస్తవిక సరిహద్దు లెక్కల సమాచారంతో ఫొటోలు వస్తాయన్నారు. తద్వారా సదరు ఆస్తి ఎవరి పేరిట ఎంత విస్తీర్ణంలో ఉందనే కచ్చితమైన సమాచారం వస్తుందని తెలిపారు. వందేళ్ల తరువాత ఈ సర్వే జరుగుతోందని, నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పైలెట్ ప్రాజెక్టు కింద ఆంజనేయ కాలనీ, ఆత్మకూరు నిర్మలా కళాశాల ప్రాంతాల్లో డ్రోన్ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆ తరువాత ఒప్పందం కుదుర్చుకున్న కాంట్రాక్ట్ సంస్థ నగరం మొత్తం సర్వేను పూర్తి చేస్తుందని చెప్పారు.

సర్వే అనంతరం ప్రాపర్టీ సర్టిఫికెట్లు..

జగనన్న శాశ్వత భూ హక్కు సర్వే పూర్తయిన తరువాత సదరు ఆస్తి తాలూకా యజమాని పేరిట సర్టిఫికెట్ జారీ చేయనున్నట్లు అసిస్టెంట్ సిటీ ప్లానర్ సీహెచ్ వెంకటేశ్వరరావు తెలిపారు. సదరు సర్టిఫికెట్‌లో ఆస్తికి సంబంధించి సరిహద్దు లెక్కలతో పూర్తి వివరాలు నమోదు అవుతాయన్నారు. మంగళగిరి –తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని 192.16 చ.కి.మీ. విస్తీర్ణం వరకూ ఈ సర్వే జరుగుతుందన్నారు. సర్వే తరువాత హద్దులు రద్దు చేయడానికి ఏ మాత్రం కుదిరే అవకాశం ఉండదన్నారు. ఆస్తి వివాదాలను సులభంగా పరిష్కరించుకోవడంతో పాటు ఆక్రమణలకు ఆస్కారం ఉండదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ అధికారి సీహెచ్ వెంకటేశ్వరరెడ్డి, సచివాలయ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ అనిల్, ప్లానింగ్ సెక్రటరీ నయోమి, ఎమినిటీ సెక్రటరీ కావ్యశ్రీ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో జాప్యం వద్దు

- పనులను వేగవంతం చేయాలి
- డీఈ కృష్ణారెడ్డి



ఇప్పటంలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న డీఈ కృష్ణారెడ్డి

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలో స్పెషల్ గ్రాంట్ నిధులతో నిర్వహిస్తున్న పనుల్లో జాప్యం జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందిదేనని డీఈ కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని ఇప్పటం, కొలనుకొండలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన ఏఈ కిషోర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ కృష్ణారెడ్డి మాట్లాడుతూ స్పెషల్ గ్రాంట్ నిధులను ఇప్పటికే ప్రాంతాల వారీగా కేటాయించామని, ఇప్పటం, కొలనుకొండ, నూతక్కి, రామచంద్రాపురం, పెదవడ్లపూడి ప్రాంతాల్లో అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. ఈ పనులు స్థానికంగా ఉన్న సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బంది పర్యవేక్షణలో జరుగుతున్నాయన్నారు. ఇప్పటంలోని ఇంజినీరింగ్ సిబ్బందితో మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా పనులను వేగవంతంగా పూర్తిచేసేలా జాబ్ క్యాలెండర్ ఏర్పాటు చేసుకుని పనులు చేయించాలని సూచించారు. కార్పొరేషన్ పరిధిలో ప్రారంభించిన ఏ ఒక్క పని కూడా ఆగకుండా చేయాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు మున్నంగి వివేకానందరెడ్డి, కొలనుకొండ వైఎస్సార్ సీపీ కన్వీనర్ నూతక్కి శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శుభ్రతపై అవగాహన అవసరం

ఫిరంగిపురం: 10 నుంచి 18 ఏళ్ల మధ్య బాలికలకు పరిశుభ్రతపై ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించాలని అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో ఇ.అన్నపూర్ణమ్మ అన్నారు.

అత్యవసర వైద్య సేవలపై అవగాహన



జాతీయ స్థాయి సంగ్రహ - 2023 కార్యక్రమంలో పాల్గొన్న వైద్య బృందం

మంగళగిరి: చినకాకాని ఎన్నారై వైద్యశాల క్రిటికల్ కేర్ విభాగం హెచ్ఓడీ డాక్టర్ షేక్ ఆరిఫ్‌బాషా ఆధ్వర్యంలో బుధవారం అత్యవసర వైద్య సేవలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ స్థాయి సంగ్రహ–2023 కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమాన్ని అడ్మినిస్ట్రేటర్ మండవ విష్ణువర్ధనరావు ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అత్యవసర వైద్య విభాగం అత్యంత ప్రతిష్ఠాత్మకమైనదన్నారు. వైద్య విద్యార్థులకు పలు విభాగాల పట్ల అవగాహన కల్పించేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. పలువురు ఫ్యాకల్టీ వైద్యులు హాజరు కాగా డాక్టర్ ఏహెచ్ చౌదరి, డాక్టర్ మురళీవెంకటేశ్వరరావు, డాక్టర్ మనోజ్, డాక్టర్ సుబ్బారెడ్డి, డాక్టర్ సుహాసిని, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మి, సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ ఈశ్వర్, డాక్టర్ కుమార్ చౌదరి పాల్గొన్నారు.

• అభాగ్యుడికి ఆసరా



గుర్తుతెలియని వృద్ధుడిని 108 అంబులెన్సులో చేర్చుతున్న సేవాసమితి బాధ్యులు

"అన్ని తీసే(రాసే)సుకుని ఇక అవసరం లేదనుకున్నారో ఏమో.. తమను చక్కగా చదివించి, అన్ని చూసుకున్న తండ్రిని భారమంటూ, మాకొద్దంటూ రోడ్డున పడేశారు కర్కశ పిల్లలు. మంచి భవిష్యత్తు అనే పూలపాన్పుపై పిల్లలను నడిపిస్తే, తీరా తాను కాలు మోపేందుకు స్థలమంటూ లేకుండా చేశారే అంటున్న ఆ వృద్ధ తండ్రి హృదయ ఘోష దాహంతో తడారిపోయిన పెదవుల నుంచి బయటకు రాలేకపోయింది. చెడిపోయి, కంపుకొట్టే మనస్తత్వాలు కలిగిన మనుషుల కంటే మరుగుదొడ్ల దుర్గంధమే హాయిగా అనిపించిందేమో వాటి పక్కన కదలక, మెదలక అలాగే పడుకుండిపోయాడు."

స్థానిక రైల్వేస్టేషను ఎదురుగా గల మరుగుదొడ్ల దగ్గర రెండురోజుల క్రితం ఎవరో వదిలివెళ్లిన సుమారు 70 ఏళ్ల వృద్ధుడు రోడ్డుపక్కనే నిస్సహాయుడిగా ఉండిపోయాడు. సేవాసమితి సభ్యుడు పోతురాజు ఆ వృద్ధుడికి రెండురోజులుగా ఆహారం అందిస్తున్నారు. అలాగే వదిలేస్తే ప్రమాదమని భావించిన సేవాసమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను 108 అంబులెన్స్ వాహనాన్ని రప్పించి, బుధవారం తెనాలి ఆసుపత్రిలో చేర్పించారు. – తెనాలి